


# మార్పుకు మంగళారి

రెండు రోజులు క్రితం....

ఆ గదిలో గాలి భయపడింది....గాలితో పాటు దేవుళ్ళున్న కేలండర్లు....ప్రజలు, దేశం గుర్తుంచుకోవలసిన వ్యక్తుల ఫొటోలూ భయపడ్డాయి. ఆ గదికి అధికారి అయిన హెడ్మాస్టరు వెంకట్రామయ్య గారూ భయపడ్డారు.

"మళ్ళీ ఈ వారంనాడు వస్తాను. మీ రేమైనా చేస్తే సరే.... లేకపోతే నేను చేయగలిగింది చేస్తాను" అన్నాడు ప్రసాద్. ఆ మాటలు పలికిన స్థాయిలో ఆవేశం లేదు కాని....ఆ పలికిన తీరులో ఆవేశం ఉంది.

వెంకట్రామయ్యగారు తలమాత్రం ఊపారు.

వెళ్ళిపోతున్న ప్రసాదుకి ఆయన భయపడుతున్నట్టు తెలిసింది కాని, తనవల్ల....ప్రత్యేకించి తనకి ఊళ్ళో ఉన్న పేరువల్ల ఆయన భయపడ్డారని తెలియదు.

• • •

ఇవాళ....

రంగనాథంగారు హడావిడిగా ఆఫీసుకు బయలుదేరి నాలు గడుగులు వేయగానే....

"ఇదిగో, రంగనాధం....మీ వాడు...." అన్న పిలుపుతో పక్కింటి అరుగుదగ్గిర ఆగి అంత హడావిడిలోను వినక తప్పలేదు.

"ప్రసాద్ మరీ ఇంత రౌడీలా తయారవుతా డనుకోలేదు.

మొన్న హెడ్మాస్టరు వెంకట్రామయ్యని దడిపించాడట,...మరికొంచెం కవిపెట్టు." ఆ మాట విని రంగనాధంగారు తొందరగా నడవలేక పోయారు.

ప్రసాదును గురించి ఎవరేం చెప్పినా వినటం తప్ప వాటిని గురించి ఆలోచించకూడదని ఆయన చేసుకున్న నిర్ణయాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు.

'అయినా హెడ్మాస్టరుతో వీడి కేం గొడవో?' అనిపించింది రంగనాధం గారికి ఒక్క క్షణం....

జేబు తడుముకుంటే పర్సు కనపడలేదు. వెనక్కి ఇంటికి వెళ్ళి తెచ్చుకోవాలో,..ముందుకి నడిచి వెళ్లాలో, కాస్సేపు తటపటాయించి ముందుకి నడుస్తూంటే....

రెండు నెలల క్రితం సరిగ్గా అలాగే నడిచి ఆఫీసుకి వెళ్ళిన రోజు గుర్తు వచ్చింది. ఆ నాడు జీతాల రోజు. బస్సుకని, అంతకు ముందు రోజు దాచి ఉంచిన పావలా పోయిన రోజు....

అలా నడుస్తుంటే ఆ రోజు చిత్రమైన ఊహలు వచ్చాయి రంగనాధంగారికి, బస్‌స్టాప్ దాటి కొంతదూరం రాగానే....

'ఇదే బస్సయితే....'' అనుకున్నారు. చూడాలన్న ధ్యాస లేక పోయినా రంగురంగుల పైటల్లోంచి కనిపించే మెత్తటి అందం గుర్తుకు వచ్చింది.

ఇంకో అర ఫర్లాంగు నడిచేటప్పటికి...,

రిక్షా అయితే అనుకున్నారు....రిక్షా తొక్కేవాడి పిక్కలు మెరుస్తూ కనపడటం....హుషారు రోజుల్లో గుర్తు వచ్చింది.

నడుస్తూంటే నెత్తిమీద కాలుతున్న ఇనుమున్నట్టనిపించింది ఇంకొంచెం దూరం తరవాత.

ఆ మూడు విడి ఊహల సమన్వయం గురించి ఆలోచిస్తుంటే మళ్లీ పావలా పోయిందని గుర్తువచ్చింది....ఇది మొదటిసారి కాదు.

అంతకుముందొకసారి పోయింది రంగనాధంగారి జేబులోంచి పావలా. అనాడు 'ఏమయింది....ఎలా పోయింది?' అని ఆలోచించలేక పోలేదు. కాని ఇంట్లోనే పోయింది అన్న ఉద్దేశం ఈ సారి ఉన్నంత బలంగా కిందటిసారి లేదు. నెమ్మదిగా నడుస్తూంటే రంగనాధంగారి ఊహల్లో అనుమానం రూపాలు పొందింది.

ఎవరు? తను తీస్తుందా....లక్ష్మి తీస్తుందా....ఏమో ఏదేనా అవసరం వచ్చి ఏ బెల్లానికో, ఏ కూరకో తీయచ్చు. ఇన్నేళ్ళు కాపరం చేసిన తనకి మొగుడి జేబులోంచి తీసుకునే అధికారం లేకపోలేదు, కావి పావలా పోయిందని ఒకటికి రెండుసార్లు అనుకున్నా తీశానని చెప్పక పోగా, 'పోనీ లెద్దురూ పావలాయేగా' అన్నట్టు మెలిగింది....తనై ఉండదు, ఏమో, అలా ఓ పావలా....అలా ఓ అర్ధ చేరిస్తే పిల్లలకి పనికి వస్తుందేమో...

రోడ్డు మలుపులో ఒక్క_క్షణం ఆగా లనిపించింది రంగనాధం గారికి, 'ఇంకో రెండు ఫర్లాంగులేనా ఉంటుంది ఆఫీసు' అనుకున్నారు.

దూరాన్ని గుర్తుచేసుకోగానే శరీరానికి. అలవాటుకి చాలా సంబంధం ఉందనిపించింది. ఇదే నడక రోజూ అలవాటుంటే ఇంత శ్రమ ఉండ దనిపించింది. 'సాయంత్రం జీతాలు... చేతినిండా డబ్బుం టుంది. బస్సులో కాకపోతే రిక్షాలో రావచ్చు. కాని ఇప్పుడు నడక తప్పలేదు, ఈ రోజు బస్సుకని ఉంచిన పావలా,...'

మరి లక్ష్మి కాకపోతే ఇంకెవరు?....వనజా....చిన్నప్పటినుంచి పద్దెనిమిదేళ్ళ ఈనాటివరకూ ఎంతో స్పష్టంగా సూటిగా ఏం కావలసినా అడుగుతూ వచ్చింది. తను తీస్తుందా?.... ఏమో, ఈ మధ్యన ఇదివరకంత చలాకీగా ఉండటం లేదు. కాలేజీనుంచి ఇంటికి రాగానే "ఉత్తరాలు వచ్చాయా?" అన్నదే మొదటి ప్రశ్న....వనజకీ వయసు వచ్చింది, ఈ విషయం తనకన్నా ముందే గుర్తించినవాళ్ళు ఉండకపోరు. ఈ వయసుకి, ఉత్తరాలకి జీవితంలో బలమైన సంబంధం ఉంది. ప్రతి తల్లీ, తండ్రీ పిల్లల్ని

సైకలాజికల్‌గా స్టడీచెయ్యవలసిన వయస్సు...,ఏమో, తనుతీస్తుందా?
....అబ్బే....

అలాగే రంగనాధంగారి అనుమానం ప్రసాద్ రూపంకూడా పొందింది ఒక్కక్షణం... ప్రసాద్ అవసరాలు, పావలా అర్ధతో తీరేవి కావనిపించింది మరుక్షణంలోనే...

ఆఖరికి.... 'మరింకెవరు,...సీతాలా?'....అనుకున్నారు.

ఎంత పవిమనిషి అయినా అనుమానపడటం మంచిది కాదను కున్నారు. పైగా, ఎప్పుడో దొడ్లో పడిపోయిన బాబిగాడి ఉంగరం దొరికితే సీతాలు తెచ్చి ఇచ్చేసిందని ఎన్నోసార్లు భార్య పొగడటం గుర్తు వచ్చింది.

అంతే ఆ రోజు అలా నడిచి ఆఫీసు చేరుకోటానికి పావు గంట ఆలస్యమైంది కాని....పావలా విషయం తేలలేదు.

• • •

సరిగ్గా నెల రోజుల తరవాత....

ఓ నెల గడిచింది' అని గుర్తుగా అనుకుంటేనే గాని సమయం గడిచినట్టనిపించలేదు రంగనాధంగారికి. దానికి కారణం ఆలోచిస్తూ కూచున్నారు వరాండాలో.

మార్పు లేకా....జీవితంలోనే కాదు మార్పు ఆలోచనల్లోకూడా ఉండటం లేదు. సమయాన్ని గుర్తించటానికి మార్పు అవసరమా? ఎక్కడివరకూ ఈ మార్పు? దేనినుంచి దేనికి మార్పు?....

అసంతృప్తి ఉండబట్టే మార్పు కావా లనిపించటం, మార్పు కావాలన్న భావన ఉంది. ఆ భావనని కగిపే చైతన్యం కావాలి, అదే లేదు. రోజురోజుకి మార్పు జరుగుతూంది. ఆ మార్పుని ఆ క్షణాన్నే బిలంగా గుర్తించేలా జరగటం లేదు.

ఈ నెలలో మార్పు....

నాలుగు రూపాయల ఇక్రిమెంటు వచ్చింది...,

పదిపైసల బస్సుదూరం పదిహేను పైసలైంది.
ఇదివరకు లేని కాళ్ళవాపు జబ్బు మొదలైంది.

వనజ ఉత్తరాల కోసం ఎదురుమాట్టం లేదు. ఉత్తరాలు రాస్తు న్నట్టు కనపట్టం లేదు. ఇదివరకులా సహజంగా నవ్వలేకపోతోంది. ఇదంతా సంతృప్తిని కలిగించే మార్పు కాదు.... ఈ నెలలో....

ఈ నెలంటే.... రెండోసారి పావలా పోయిన ఆ నాటినుంచి .... అంటే ఆ సంఘనకి బలంఉంది. అది మరిచిపోలేదు.... సమ యాన్ని గుర్తింప చేస్తూంది.

దాన్నిగురించిన ఆలోచన వచ్చినప్పుడల్లా పోయిన ఆ పావలా విషయం మరిచిపోవా లనిపిస్తుంది రంగనాథంగారికి. కాని మరుపు రావటం లేదు. పావలా అంత విలువైందని కాదు.

విలవ విషయం వూహించినప్పుడు కాదని ఎలా అనుకోవటం? .... ఆ పావలా ఆ నాడు తన అరగంట నడక.... అదే రిక్షావాడికైతే శరీర కష్టానికి, చర్మం చెమర్చిన కొంత చెమటకి ప్రతిరూపం. అడు క్కునే వాడికైతే కొన్ని గంటల ఓర్పు....

వాళ్ళ కున్నంత విలవ పావలాకి తనదృష్టిలో లేకపోవచ్చు. తన కున్నంత ఇంకొకళ్ళ దృష్టిలో ఉండకపోవచ్చు.

విలవకాకపోతే మరి మరిచిపోలేక పోవటానికి కారణమేమిటి? రెండోసారి పోవటమా? రెండోసారని నమ్మకమేమిటి? .... ఇదివరకు ఎన్నిసార్లు పోయిందో, గుర్తించటానికి వీలులేని రోజుల్లో .... జేబులో కొంచెం ఎక్కువ చిల్లరున్నప్పుడు.

డబ్బు ఇంతుంది, అంతుంది అని కాదు, ఎప్పుడూ ఒకేవిలవతో, అవసరానికి కొలతలా కాకుండా, పావలాని పావలాలాగే చూడాలనే స్నేహితుడి మాటలు గుర్తువచ్చాయి రంగనాథం గారికి.

చిన్నటంత కాకపోయినా కాలు కొద్దిగా లాగుతున్నట్టనిపిం చింది రంగనాథంగారికి.... వాపుకూడా చిన్నటంత లేనట్టనిపించింది.

'నిన్నటికి.... ఈ రోజుకి పోలిక. జీవితం ఈ పోలికలతోనే సరిపోతుందా—రేపటితో సెలవయిపోతుంది. మళ్ళీ ఆఫీసు' అనుకున్నారు.

• * •

నిజంగా నమ్మకం కలగటం లేదు రంగనాధంగారికి....ఎదురుగా జరుగుతున్నా—గదిలో బాబిగాడు చొక్కా-జేబులోంచి డబ్బులు తీస్తున్నా....ఏళ్ళ మిదేళ్ల బాబిగాడు ఎంతో నిర్భయంగా కావలసింది తీసుకెళ్ళిపోయేడు.

'ఆ నాడు లక్ష్మిని....వనజని....ఆఖరికి సీతాల్ని కూడా అనుమానించిన నా దృష్టి బాబిగాడివరకు రాలేదెందుకనో!' అనుకున్నారు.

రంగనాధంగారి దృష్టిలో వాడు వేరు. కోరికలతో చీడపట్టిన చెట్టు కాదు వాడు....ఇంకా పసితనంలో పచ్చగా ఉన్న మొక్క.

ఆ సంసారంలో ఆయన కలలు కంటున్న ఉన్నతి—కోరుకుంటున్న మార్పు వాడిద్వారానే. చెడునుంచి దూరంగా ఉండే ప్రయోజకత్వంతో వాడు ఉన్నతుడు కావాలనేదే అంతర్గతంగా, బలంగా ఉన్న కోరిక.

'ఎందు కిలా చేశాడు? ఎందుకిలా....'

కాలు కొద్దిగా లాగుతూంది. అయినా తొందరగానే నడుస్తున్నట్టు తెలుస్తూంది రంగనాథంగారికి....

బాబిగాడు ఎంతో హుషారుగా నడుస్తున్నాడు. ఫర్లాంగు దూరమే ఉంటుంది స్కూలు

మెడకి బాగ్. చిన్న నిక్కరు....చొక్కా. స్కూలు బాధ్యతతో వడివడిగా నడుస్తూండగా రోజు వాణ్ణలా చూస్తూంటే ముద్దుగా ఉండేది. గుండె మెత్తగా వణికేది రంగనాథంగారికి.....

కాని ఇప్పుడు వాడు....నడక....కంగారు....ఇది వేరు.

తిన్నగా స్కూల్ దగ్గర కే....ఇంకా టైముంది.

గేటుదగ్గర ఇంకా పిల్లలున్నారు. గుంపుగా కొందరున్నారు.

షరీ దగ్గరికి వెళ్ళక్కరలేదు. అదేమిటో తెలియటానికి.... నేలమీద పెద్ద అట్ట. అరు గళ్ళు... వరుసగా ప్రతి గదిలోనూ అంకెలూ ....దబ్బాలో రెండు పాపుల మోత....వాడు అరుస్తూనే ఉన్నాడు. "ఒకటి....రెండు ఖాళీ....కాయ్ రాజా కాయ్...."

ఎనిమిదేళ్ళ బాబిగాడికి జూదమంటే ఏమిటో తెలిసిపోయింది. డబ్బుమీద వ్యామోహం అంటే ఏమిటో తెలిసిపోయింది. స్కూల్ బెల్ కొట్టేవరకు అక్కడే నిలబడ్డారు రంగనాధంగారు. తప్పనిసర న్నట్టు కొందరు. ఉత్సాహంతో కొందరు పిల్లలు లోపలికి వెళ్ళారు. ఇంకా ఒకళ్ళిద్దరు ఇంకాసేపాడారు.

స్కూలు లోపలికి వెడుతున్న బాబిగాడి కళ్ళలో దిగులుంది. అనాటి జీవితాన్ని అయోమయం చేసే దిగు లది. పిల్లలందరూ వెళ్ళి పోయారు. మిగిలింది రంగనాధంగారే....

ఆయనకి ఒక పక్క ఈగలు ముసురుతున్న సెనగ లమ్మే వాడు....ఇంకోపక్కన ఐస్ తరుగుతున్న ఐస్ బండివాడి చప్పుడు.... మరోవైపు పచ్చి జామకాయలు ముందు పెట్టుకున్న ముసలమ్మ....

ఇవన్నీ బాబిగాణ్ణి, స్కూల్లో చేసుస్తున్న నాదే చూశారు రంగ నాధంగారు. పిల్లల ఆరోగ్యానికి ఇవి ఎంత అపకారమో అనిపించింది ఆయనకి....స్కూలుముందు ఈ వాతావరణం మారితే మంచి దని పించింది....

మారింది....నిజంగా మారింది. పిల్లల ఆరోగ్యాన్నే కాదు, ఆలోచనల్ని....జీవితాల్ని మార్చే మార్పే జరిగింది....

కాలు లాగుతున్న నెప్పితోనే ఇంటికి వచ్చి....నమ్మకం లేక పోయినా. 'స్కూలు ముందు వాతావరణం మారటం చాలా అవసరం' అని హెడ్మాస్టరుకీ, అధికార్లకి అప్లికేషన్ రాశారు రంగనాధంగారు.

ఇదంతా గత రెండు నెలలుగా జరిగింది. ఈ నాడు ఆఫీసుకి నడిచి వస్తున్న రంగనాధంగారి కళ్ళముందు స్కూలు మెదిలింది....

ఏం జరిగింది మార్పు అనుకుంటే?....ఏమీ కనపడలేదు.

• • •

సాయంత్రం....

ఇంటికి రాగానే ప్రసాద్‌ని అడగాలనిపించింది రంగనాథం గారికి.

ప్రసాద్ ఎదురుపడగానే "ఏమిట్రా, హెడ్మాస్టరుతో ఏదో గొడవ...." అని అసంపూర్తిగా ఆపేశారు.

సాధారణంగా తండ్రి దృష్టికి ఇరవై రెండేళ్ళ కొడుకు పెద్దవాడిలా కనిపించడు. కాని రంగనాథంగారికి ప్రసాద్ ఎంతో ఎదిగినట్టు కనిపిస్తాడు.... ఇంతవరకూ ప్రసాద్‌కి స్వతంత్ర జీవనం లేకపోయినా. దానివల్ల దేన్నీ తెగేసి అడగలేరు రంగనాథంగారు. ఎవరెవరో ఏవేవో చెప్పినా ప్రసాద్‌ని సాధారణంగా ఏమీ అడగరు. అడిగినా ప్రసాద్ ఎక్కువగా సమాధానం చెప్పడు....

కాని ఈసారి ప్రసాద్‌కి చాలా చెప్పాలనిపించింది. అవును, హెడ్మాస్టరుని కలుసుకున్నానని.... వచ్చేవారానికి ఏ సంగతి తేలుస్తానని చెప్పాలనిపించింది. జీవితంతో రాజీపడి నీళ్ళు నమిలేరోజులు కావని చెప్పాలనిపించింది. తను జీవితంలో ఉన్నతంగా తయారవక పోయినా, జీవితంలో ఏవి చెడు కలిగిస్తాయో తెలుసుకున్నానని చెప్పాలనిపించింది.... వీటన్నిటికన్నా, గట్టిగా ధీమాగా నా తమ్ముణ్ణి నేను రక్షించుకుంటున్నానని.... దానికి తను నడుస్తున్నదే సరిఅయిన దారి అని. ఆ బాధ్యత తనకుందని, తనకే కాదు, బాబిగాడిలాంటి తమ్ముళ్లున్న ప్రతివాళ్ళకి ఉందని చెప్పాలనిపించింది.

ఇవేవి చెప్పలేకపోయాడు. నెమ్మదిగా అంత ఆవేశాన్ని మింగి తమ్ముడు డబ్బు తీస్తూండగా తను చూశానని.... హెడ్మాస్టరు దగ్గిరికి అందుకే వెళ్ళానని చెప్పాడు.

ఆరోజు అప్లికేషన్ రాస్తూ బాధలో ప్రసాద్‌కి అవన్నీ చెప్పటం

గుర్తు వచ్చింది రంగనాథంగారికి. ప్రసాద్ తన మాటల్ని సరిగ్గా వింటాడన్న నమ్మకం ఏనాడూలేదు.

కాని ఇంత ఆవేశంగా వాటిని గురించి ఆలోచిస్తాడనుకోలేదు. లోలోపల ఓ జంకుంది రంగనాథంగారికి.

"అయితే మరి హెడ్మాస్టరుమీద చెయ్యి చేసుకుంటావా...." పూర్తిచేయలేకపోయారు మళ్ళీ జంకుతో.

ప్రసాద్‌కి ఇప్పుడు తెలిసింది హెడ్మాస్టరు ఆ రోజెందుకు భయపడిందీను....తండ్రి అడిగిన ప్రశ్నకి నవ్వు వచ్చింది....సమాధానము చెప్పలేకకాదు, హెడ్మాస్టరు పరిస్థితి తలుచుకుని.

* * *

వారం గడిచింది....ప్రసాద్ ఆ హెడ్మాస్టరు గదిలోకి మళ్ళీ వెళ్ళలేదు. స్కూలు గేటువరకే వెళ్ళాడు. ఊళ్ళో ఆ రోజు రాత్రి చీకట్లో రెండుముఠాలు కొట్టుకున్నాయి. ఆ మరునాటినుంచి స్కూలు ముందు పూర్తిగా మార్పు జరిగింది....

ఆ జూదగాడితోపాటు జైల్లోఉన్న ప్రసాద్‌ని విడిపించటానికి జామీను వెతకటంకోసం సెలవు పెట్టారు రంగనాథంగారు.

('ఆంధ్రప్రభ'లో ముద్రితము)